# తల్లి ★ ★ ★ మతాబా

శ్రీ జానకిరాం పట్నాయకులు

రాధా!

ఆశీస్సులు! నీ ప్రేమగల జాబు అందింది. నేను దీపావళికి వస్తున్నాను....వారం రోజులు శలవు. నీవు కోరినవస్తువులు ఒక్కటేనా తప్పకుండా తెస్తున్నాను...

మరో శుభవార్త: ఉద్యోగంలో ఖాయపర్చినట్లుగా ఈదినంవే అధికారి తెలియపర్చినాడు.... తక్కినవన్నీ ముఖస్థం....''

ఇట్లు నీ.... మోహన్''

ఆ ఉత్తరాన్ని యెన్నిసార్లు చదువుకుందో.... ఆ సున్నితంపైన హృదయంలో ఎంత ఆనందం కలిగిందో....ఆ బుల్లితలలో ఎన్నెన్ని మధుర భావాలు లేచినాయో....ఆ తరళ నయనాల్లో ఎన్నిసార్లు హర్షాశ్రువులు క్రమ్ముకున్నాయో....చెప్పడం దుస్సాధ్యం—ఐనా! అనుభవనీయులు తెల్సుకోగలరు.

ఆమెకు ఆకలీనిద్రాశ్రమాదూరంపై పోయాయి!

''అమ్మా! దీపావళి యెప్పుడే?'' అని ప్రశ్నించింది. కూరతరుగుతూన్న తల్లిని.

''ఎన్నిపర్యాయాలు చెప్పానమ్మ వచ్చే ఆదివారం అని! ఏం మరుపేతల్లీ!....ఆయనగాని కంటపడితే ఆఖరుకు మమ్మల్నందర్నీ మరిచిపోయేలాగున్నావు'' అని తల్లి చిర్నగవుతో జవాబిచ్చింది.

అద్దపుముక్కల్లాంటి ఆ చెక్కులు ఎర్రదనం వహించినాయి. తామరరేకుల్లాంటి ఆ కన్నులు నునుసిగ్గుతో దిగువకు వ్రాలిపోయినాయి!! ఆ గులాబీ పెదవులమీద మల్లెపూలనవ్వులు చిందులాడినాయి!!!

"అక్కా! బావ యెప్పుడొస్తాడే?" అని పన్నెండేండ్ల చెల్లెలు కమల, ఆమె భుజం పట్టుకు లాగుతూ అడిగింది.

"ఎందుకూ? పెళ్లాడతానా ఏమిటి?" అని కృత్రిమకోపంతో అడిగింది.

"ఆ! మరి మగడు రానంతవఱకూ అక్క మగడే మగడుగా!" అని జవాబిచ్చింది కండ్లు త్రిప్పుతూ.

అంతలో,

"వస్తాడే మాబావ.

టాటానుంచి వస్తాడు.

దీపావళికి వస్తాడు.

పరీక్ష ఫేలయి వస్తాడు.

చినిగిన చీరలు తెస్తాడు'' అంటూ ఏడేండ్ల తమ్ముడు రా... గాలిపటం చేత్తోపట్టుకొని, గిఱ్ఱున నట్టింట్లో తిరుగుతున్నాడు. కమలా, తల్లీ ఫక్కున నవ్వారు. రాధకూ నవ్వు వచ్చింది. తోడ్తోడ ఉడుకుబోత్తనం కూడా వచ్చింది. చట్టాల్ను లేచి, తమ్ముని చెవిపట్టుకొని ''నీకు—కొండాదెబ్బలు కొడతారు" అంటూ ప్రక్కగది లోనికి పారిపోయింది.

* * *

మోహనరావు, తన బట్టలూ, భార్య కోసం కానుకలూ, సూటుకేసులో పదిల పర్చుకొని, బెడ్డింగు కట్టి, బయటి వరండాలో మోటారుకోసం నిరీక్షిస్తున్నాడు. ఎదురింటి నుంచి బాంబేటాకీస్ వారి 'కంగన' లోని ''రాధా—రాధా—ప్యారీరాధా" అన్న రికార్డు ఆనంద దాయకంగా విన్పిస్తూంది. మితి మీరిన సంతోషంతో గదిలోనికి పోయి, మేజామీదనున్న రాధ ఫొటో తీసి, ముద్దుపెట్టుకుంటూ, ఆరికార్డులోని పాటనే తానూ పాడుతూ, బయట సూటుకేసు, బెడ్డింగు పెట్టి గదికి తాళం వేసినాడు. అంతలోనే మోటారూ వచ్చింది. సరాసరి స్టేషను చేరుకున్నాడు.

బండిలో జన సమ్మర్దం విస్తారంగా ఉంది. ఏలాగో సందుచేసుకొని కూచున్నాడు. సూటుకేసు, బెడ్డింగు ఎదుటి బల్లమీద భద్రంచేసినాడు. తలలో అనేకంపైన మధురభావాలు తిరిగి పోతున్నాయి.

''రాధ;....అందాల బొమ్మ; .... పసినిమ్మపండుఛాయతో నున్న ఆ శరీరం—నల్లత్రాచులాంటి ఆ వాలుజడ మేఘాలచాటున మెఱుపులా అందులోని సంపెంగపూలు. మోహంతో మత్తెక్కి వాలిపోతూన్న కలువరేకుల్లాంటి ఆ కండ్లు...మరుద్దాంవని యెంత ప్రయత్నం చేసినా మరపునకురాని ఆ చిర్నగవు ప్రతీ అవయవంలో నుంచీ అమృతవాహినిలా ప్రవహిస్తూన్న లేయౌవనం...ఆ కోకిలకంఠం...ఆ మనుసిగ్గు... అతని మనోవీధిలో నాట్యమాడుతూన్నాయి. జేబునుంచి, ఆమె వ్రాసిన జాబుతీసి, వేరోసారి చదువుకున్నాడు.

''ప్రియా! నమస్కృతులు!

ఈ దీపావళికేనా తమదర్శనం యిచ్చినారంటే ధన్యురాలనవుతాను. ఈ ఆరుమాసాలూ ఆరుయుగాలై పోయినా యంటే నమ్ముతారా? ప్రథమంలోనే ఈ యెడబాటు...ఏంవని వ్రాసేది? ఏలా నేనా వీలుచేసుకొని రావలసిందని మా అమ్మ కూడా వ్రాయమంది...అవకాశం ఉంటే...కాఫీ రంగుచీర ఒకటి...పసుపువన్నె రిబ్బన్లు...క్రిమెంట్సు పిన్ను చిన్నది ఒకటి...అల్లికసూదులు కొంచెం ఊలు...తీసుకొనిరాకోర్తాను...ఒక్కసారి యిన్నివస్తువులా అనుకుంటారేమిటో? అందుకే.. 'అవకాశం ఉంటే' అన్నాను.

మీరాకకోసం ఆతృతగా చూస్తూన్న.

మీ పదదాసి...రాధ''

పిచ్చిపిల్ల! 'ఇన్నివస్తువులా' అని వ్రాసింది. ఎన్నివస్తువులో?...పైగా (చిటికెనవ్రేలి ఉంగరం చూస్తూ) ఇదో మరి?..,ఆ సంపెంగరంగు వ్రేలికి ఈ చిన్ని ఉంగరం...ఎంతశోభనిస్తుందో కదా!...మొత్తంమీద అల్పసంతోషి! నిజంగా రాధ...నా హృదయేశ్వరి అవడం పూర్వపుణ్యవిశేషం!! ఆమెతో కాపురం, నట్టడవిలోనైనా... మరుభూమిలోనైనా....స్వర్గసమానంవే..,''

ఖర్గపురం జంక్షను వచ్చేవఱకూ అతను, మధురభావతరంగాల్లోనుంచి తీరం చేరుకోలేదు. ప్రక్కాయన "ఖర్గపురం వచ్చాం. దిగరూ?" అని అడిగేసరికి, తెప్పిరిల్లి "వచ్చేశాంవా?" అంటూ బెడ్డింగూ, సూటుకేసూ పటుకొని అవతల ప్లాటుఫారం చేరుకున్నాడు. 'పూరీ' పోయేబండి సిద్ధంగాఉంది. జనం అట్టేలేరు. సామాను భద్ర పర్చుకొని, తిరుగా ఆలోచనా ప్రవాహంలో పడ్డాడు.

తెల్లవారుఝామున, ఆబండి 'ఖుర్దా' చేరుకుంది. అచట మరలా దిగి, నిద్రకండ్లతోనే

'వాల్తేరు' పోయే బండిలోనికి వెళ్ళినాడు...పెట్టి అంతటికీ అతనొక్కడే! సూటుకేసు తలక్రింద పెట్టుకొని, బెడ్డింగుపర్చుకొని పడుకున్నాడు.

ఉదయం ఏడుగంటలయేసరికి 'కాల్వరాఘాట్' స్టేషను వచ్చింది. లేచినాడు. ఆ భారమైన కండ్లకు...ఎదుటిబల్లలో, వేడికన్నుల్తో తన్నే చూస్తూన్న ఓ యువతి కన్పించింది...మఱలా కండ్లునులుముకొని వేరోసారి ఆమె ముఖం లోనికి చూచినాడు. నాల్గుకండ్లూ కలుసుకున్నాయి! అప్రయత్నంగా, ఆమె చిన్న నవ్వు నవ్వింది. ఆ చూపుల్లోనూ, ఆ నవ్వుల్లోనూ, ఏం మంత్రశక్తిఉందో కానీ మోహనరావు క్షణంలో లొంగిపోయినాడు. తనూ ఓసారి నవ్వినాడు. మరల ఆమే నవ్వింది...

సూటుకేసువిప్పి, 'టూత్‌పౌడర్' 'బ్రష్షూ' వెండిబద్దా తీసుకొని, నీటికొళాయి దగ్గరకు వెళ్ళినాడు. దంతధావనాదికృత్యాలు ముగించుకొని 'టీ—టిఫిను' కాజేసుకొని బండిలోనికిపోయాడు.

బండి కదుల్తూన్న సమయంలో 'గొల—గొల' మంటూ ఓ పదిమంది ఓఢ్రగ్రామీయులు ఆ పెట్టెలో దూరిపోయినారు. అంతకుముందే ఐదారుగురున్నారు. పెట్టెచిన్నది. త్రొక్కులాట జరిగిపోయింది...పాపం! ఆమె దిగాలుపడి బెంచీ చివరకు పోయింది...మోహనరావు ఉన్న బెంచీమీదకు మాత్రం ఎవరూ రా సాహసించలేకపోయారు. బహుశా అతనివేషం—అర్భాటం చూచి కాబోలు!

ఆ మొఱటుమనుష్యుల్లో ఆమె అలాఉండడం అతడు సహించుకోలేకపోయాడు...సానుభూతి స్వరంతో" అభ్యంతరం లేకపోతే...మీరు...ఈలా కూచోవచ్చు" అని తన ప్రక్కకు ఆహ్వానించాడు. ఆమె, మునిమునినవ్వుల్తో, కొంచెం జంకుతూ, పరచిఉన్న ఆ ప్రక్కను ఒత్తిగించుతూ కూచోబోయింది.

''పరవాలేదు అలా పక్కమీద కూచోండి" అన్నాడు. ఆమె కూచుంటూ, మందహాసంతో ''నేను తెలుగు మనిషినని ఏలా అనుకొన్నారు" అని ప్రశ్నించింది.

"తెల్గుదనం ముఖంలో కన్పిస్తూంది కాబట్టి" అన్నాడు.

ఆమె ఊరుకుంది, ఐదారునిముషాల వఱకూ యిద్దరూ మౌనంగా ఉన్నారు.

"మీపేరు?" నిశ్శబ్దాన్ని భేదిస్తూ మోహనరావు ప్రశ్నించాడు.

''లీల"

''ఎచ్చటనుంచి వస్తున్నారు?"

''కలకత్తానుంచి"

''ఎచ్చటకు వెల్తున్నారు?"

''ఎచ్చటకా?" అని ఓ వేడినిట్టూర్పు విడిచి తలదించేసుకుంది.

మోహనరావు చకితుడైనాడు....ఆమెలో ప్రవేశించిన దీనత్వానికి సహించుకోలేకపోయాడు.... ఆమె తలయెత్తింది. ఆ తళుకుచూపుల్లో గ్ఱ్ఱున నీరు ప్రవహిస్తుంది. అతనిమనస్సు చుఱుక్కుమంది.

''మీ హృదయానికి నొప్పికల్గించానా " అని ఆతృతగా ప్రశ్నించాడు.

లేదన్నట్టు తలనూపింది.

''అయితే—?" అన్నాడు

''నారాత—ఎంతదూరం తీసుకుపోతుందో అంతదూరం....' రుద్ధకంఠంతో జవాబిచ్చింది.

''ఎవరూ లేరూ?" అని కౌతుకంగా అడిగినాడు.

''ఉన్నారు! తల్లీ....తండ్రీ....అన్నలూ.... బంధువులూ....సిరీ....సంపదా! కాని!....ఏం లాభం?"

''ఏం?"

''అందరూ నాకు వ్యతిరేకులు!"

''ఏ సందర్భంలో?''

''నా భావిజీవిత సమస్యలో!"

''అంటే వివాహం సందర్భంలోనేనా?"

''ఔను."

''వాళ్ళ అభిప్రాయం ఏమిటి?"

''అంతా వ్యతిరేకం!...వాళ్ళు ఏర్పికూర్చిన ఆయనతో నా వివాహం కావాలంటారు. నాకు నచ్చిన ఆయనతో నా వివాహం కావాలంటాను నేను! అదే తీరని సమస్య అయిపోయింది!" -

''పరిణామం?"

ఇదే!....వాళ్ళకు తెలియనీయకుండా....నా కర్మ ఎటు తీసుకుపోనెంచిందో అటు వెళ్ళిపో నిశ్చయించాను....ఏదో మెట్రిక్యులేషను చదువుకున్నాను....భుక్తి గడిచిపోతుంది."

మోహనరావు హృదయంలో ఏదో మెఱుపులా ఓసంగతి గోచరించింది. రెప్పపాటుకో ఆలోచన, అతలలో గ్ఱ్ఱున తిరిగి పోతూంది, కడకు నిశ్చయానికి వచ్చాడు.

''మా ఊరు రాకూడదూ?" సంశయంగా అడిగినాడు.

''ఎందుకూ?" అని వాడినగొంతుకుతో ప్రశ్నించింది.

''....అబ్బే! .... దురభిప్రాయపడవద్దు! .... కొన్నాళ్ళు మావాళ్ళతోఉండి....తరువాత ఇష్టప్రకారం....జరుపుకోవచ్చు!"

''మీ దయకు ధన్యవాదాలు! కాని—"

''సందేహం యెందుకు "

''....మీకు....వివాహం...."

''అయింది! కాని పరవాలేదు....రాధ అంటే మాయావిడ మంచి యోగ్యురాలు! తప్పక మన్నిస్తుంది!"

''మీదేయూరు?"

''శ్రీకాకుళం"

''మీరింతగా నిర్బంధిస్తున్నారు గనుక.... సరే! అలానే కానీయండి"

మోహనరావున కేదో భాగ్యం అబ్బినట్లయింది.

క్రమక్రమంగా బరంపురం స్టేషను వచ్చింది. ఇరువురూ భోజనాలు చేశారు. వారిద్దర్నీ బండిలోనివారలు ఒక్క కుటుంబంలోనివారిగ్గా యెంచేరేమో, ఎవరూ వింతగా చూడలేదు. అయినా తెలుగుప్రాంతాలు వచ్చాక యిద్దరూ మాటల్లోనూ, వ్యవహారాల్లోనూ కొంచెం జాగ్రత పడ్డారు.

'నౌపడా' స్టేషను దాటిపోయింది. మోహనరావు ఓ ఆంగ్ల దినపత్రిక చదువుకుంటున్నాడు. బండిలో అతడూ లీలా తప్ప, ఇతరులెవరూలేరు.

ఉన్నటుండి, ఆమె, అతనిచేతిలోని పత్రికను లాక్కొని, సమీపంగా జరిగి కూచుంది. ప్రశ్నార్థకంగా అతను చూచినాడు చీరచెంగును చూపుడు వ్రేలికి చుట్టబెడుడూ నవ్వేకండ్లతో జవాబు యిచ్చింది. అప్రయతంంగా అతని ఎడమచేయి ఆమె మెడమీదుగాపోయి, ఆ గుండ్రనిభుజాన్ని పట్టుకుంది....ఆమె అతని ఒడిలో వ్రాలిపోయింది. మోహం కురిపించేచూపుల్ని అతని చూపుల్తో కలిపింది. అతను ముందుకు వంగినాడు....ఆమె పెదవులి అందించింది....అనాల్గు పెదవుల్నీ భేద్నిచుకొని చిన్నశబ్దం బయటకు వచ్చింది...ఇద్దరికండ్లూ భారంతో మూసుకుపోయినాయి. వెచ్చనినిట్టూర్పులు ఆ పెట్టెఅంతాఆక్రమిం

చుకుంది....ఆమె రెండుచేతులూ అతని కంఠానికి చుట్టుకొని ఉన్నాయి....అతని హృదయం లోని దాహాన్ని, ఆమె అమృతహృదయం— తనివార తీరుస్తూంది....ఆమె కన్నులు విప్పారి నాయి; అతని బుగ్గను ముద్దుపెట్టుకుంటూ "నన్ను....వివాహం....చేసుకోరాదూ!" అని ప్ర ణయపురస్సరంగా అడిగింది. అతడు వెంటనే- "తప్పక" అన్నాడు ఆమె ముద్దునకు బదులు తీరుస్తూ.

"అయితే ధన్యాత్మురాలిని" అంటూ ఆతన్ని మరింతగా గాఢంగా చుట్టుకుపోయింది.

"కాని....రెండోవివాహం—" అర్ధోక్తిలోనే "ఫరవాలేదు....నాకు సమ్మతంవే!....ఏమో యింతవఱకూ చలించని నామనస్సు, మిమ్మల్ని మొదటిసారి చూడ్డంలోనే....తన్మ యంలో పడిపోయింది....వివాహం చేసుకుంటే మిమ్మల్నే....లేకపోతే కన్యాత్వంవే అని అప్పుడే నిశ్చయించుకున్నాను....తుదకు నా కోరిక పూర్ణంగా ఫలించింది....అయితేనా ఈ సాహ సానికి....మీరు క్షమించ...." మరి మాటను రానీయకుండా మోహనరావు ఆమెపెదవుల్ని తన పెదవుల్తో మూసివేసినాడు.

"ఉంగరం చాలబాగుంది" అన్నదామె అతని చిటికెనవ్రేలిని పట్టుకొంటూ.

"ఇప్పుడింకా బాగుదింకదూ" అంటూ ఆమె వ్రేలికి తొడిగించాడు.

"మా అక్కగురించికాబోలు!"

"అప్పుడే వరుసలా?"

"కాదూమరి?....ఏమోబాబు చెప్పండి.... మీమగార్నినమ్మవేం?" అం టూ లేచి కూచుంది.

తిరుగా ఆమెను ఒడిలోనికి తీసుకుంటూ, గడ్డం పట్టుకు ఆడిస్తూ "అబ్బే! ఎందుకా భయం! సరదాగా అన్నాను ఔను! మీఅక్కకనే కొన్నాను" అన్నాడు.

"అయితే నావ్రేలికెందుకు?"

"మరో అప్పుడు ఆమెకు కొనవచ్చులే!"

"లేదు లేదు! నాకే మరో అప్పుడౌతుంది" అనితీసివేయబోగా "సరే! ఇంటికిపోయాక చూసు కుందాంలే! అంతవఱకూ ఉండనీ" అని వారి చాడు.

"అబ్బా! తలంతా రేగగొట్టివేశారు ....దువ్వెన ఉంటే ఇవ్వండి" అంది తలను సర్దుకుంటూ.

సూటుకేసువిప్పి, దువ్వెన అద్దం అందిం చాడు....జడవిప్పి, దువ్వుకొని తిరుగా జడ అల్లు కుంది.

"అదేంటి? రిబ్బనులాఉదేం?" అని అడి గింది.

"ఔను!" అంటూ రాధకోసం తీసుకు పోతూన్న కానుకలు ఒక్కొక్కటీ బయట పెట్టినాడు.

ఓ రిబ్బను ముక్క త్రుంచుకొని, జడ చివర ముడివేసి "ఉండ డీ! సమయానికి జ్ఞాపకానికొచ్చింది" అని తన సూటుకేసు విప్పి, అందులోని కొన్నిచీరల్ను బయటకుతీసి (ఆ కానుకలుమీద)ఉంచి, అడుగునఉన్న ఓ రిస్టు వాచీ గొల్సుతీసి ఇది బంగారంవా. రోల్డుగోల్డా?" అని ప్రశ్నించింది. దాన్ని ఆమెచేతిలోనుంచి తీసుకొని, చూచి "బంగారంకాదు. రోల్డుగోల్డే!" అంటూ అందిచాండు.

"నాకెందుకు? మీవాచీకి ఉంచుకోండి!" అంది.

"బహుమానవా?" అంటూ నవ్వాడు.

"నేనే మీకు బహుమానం అయిపోయినాను. ఇదెంత?" అంటూ బట్టలదొంతర్ని సూటు కేసులో పెట్టివేసింది. మూతవేస్తూ "అరే! అక్క సామాన్లుకూడా ఉంచివేశాను" అని మఱలా తెరచింది.

"పోనీ ఉండనీ! ఎక్కడకుపోతాయి? ఇంటికి వెళ్ళాక చూసుకుందాం" అనితన సూటుకేసు నకు తాళంవేసి, యధాస్థానంలో ఉంచివేశాడు. ఆమె తన సూటుకేసును ప్రక్కలోనే పెట్టుకుంది.

అంతలో 'తిలారు'స్టేషను వచ్చింది. చాల మంది ఆపెట్టలో ప్రవేశించినారు. తరువాత స్టేషనులోకూడ కొంతమంది వచ్చినారు. ఆముదాల వల్స దగ్గరపడుతూంది....మోహనరావు బెడ్డింగు చుట్టి, కట్టి, సూటుకేసుమీద పెట్టినాడు. బండి ప్లాటుఫారం సమీపించింది....మెల్లగా నడు స్తూంది....

"కూలీ! కూలీ!" అని కిటికీలో తలదూర్చి కేకవేశాడు.

"హా! బాబయ్యా!" అంటూ ఓకూలీ బండి లోనికి వచ్చినాడు.

"ఆ సామానుపట్టుకో" అని సూచించాడు. వాటిని తీసి కూలీ తలమీద ఉంచుకున్నాడు.

"ఆ సూటుకేసు కూడాను!" అన్నాడు లీల ప్రక్కనున్నదాన్ని చూపిస్తూ.

కూలీ అందుకోబోయాడు.

"జాగ్రత!" అని ఆమె గద్దించింది.

"లీలా!" అన్నాడు మోహనరావు తడబడ పాటుతో,

"లీల యెవరు?" అందామె జేవురించిన ముఖంతో.

"లీలా! ఏమిటీ హాస్యం!....చప్పునపద బండి కదలిపోగల్దు!" అన్నాడు ధైర్యంకూడ దీసుకుంటూ.

"హాస్యాలా?..ఎవరయ్యా నీవు? సంసారులం అనుకున్నావా మరేంటనుకున్నావా? లీల ఎవరు? ఎవర్ని పిలుస్తున్నావు? శరీరంమీద తెలివిఉందా లేదా? తిన్నగా కదులు!....తలతిరుగుడు మాటలాడి నావంటే పోలీసులిం పిలవవలని వస్తూంది" అన్నదామె క్రోధంతో కంపించు పోతూ.

బండిలోనివాళ్ళు తలో మాట అన్నారు. కాని మోహనరావు కేంవీ విన్పించలేదు. గుండెలు నిల్చిపోయినట్లయింది! కండ్లలో చీకట్లు క్రమ్ముకున్నాయి!! నోట తడి ఆరి పోయింది!!! శరీరం అతా చెమ్మటలు కమ్మి వేసినాయి!!!!!

"బాబూ! బండి దిగండి. పచ్చజెండా ఊపేస్తున్నారు" అని కూలీవాడు హెచ్చరించాడు బండి కదిలి ది....ఏలాగో ఫాటుఫార్ంమీదకు దిగినాడు.

కూలివాడు సామాన్లు శ్రీగాకుళం బస్సులో చేర్చినాడు. వాడిపోయిన హృదయంతో మోహన రావు కూలి పైసా లిచ్చివేసి బస్సులో యిరు క్కున్నాడు.

త్రోవపొడుగునా....జరిగిన సంఘటన.... ఒక్కొక్కటీ....హృదయపటంలో....చలన చిత్ర లా....తిరిగిపోజొచ్చింది ....ఆఖరు రంగం వచ్చేసరికి కండ్లలో నీరుక్రమ్ముకున్నది....

శూన్యదృష్ఠిలో అంతటా చూచాడు. అమా వాస్యచీకట్లు గాఢంగా అలుముకొనిఉంది....తన హృదయంలోకూడ....అంతకన్నా దట్టంగా అలు ముకొనిఉంది పరాభవతిమిర సందోహాలు!

బస్సు అత్తవారింటి ముందాగిది!

"అక్కా! బావవచ్చాదే!" అని కమలా, రామం, కేకవేశారు.

రాధా, ఆమె తల్లి, ద్వారంచెంతకు వచ్చారు. కమలా రాములు చెరో మతాబా వెలిగించి మెట్లెక్కుతూన్న మోహనరావునకు చెరోవేపున నిల్చుండి "బావా! తెల్లమతాబా!" అని పకపక నవ్వినారు!

పదిసెకండుపాటు, మోహనరావు మొగం కూడా ఆమతాబాలానే, తెల్లబడిపోయింది.